# చెంబుకొక గంగ!

అంకయ్య నడుస్తున్నాడు!

తలమీద పచ్చని టోపీ...ఆ టోపీ మీద కోడిపుంజు మెడమీద ఎర్రని జుట్టులా కుచ్చు... కాళ్లకు బెత్తెడెత్తు నల్లని బూట్లు... ఖాకీ చొక్కామీద ఖాకీ ప్యాంట్... నడుముకుదట్టీ... వీపున కాన్వాస్ సంచిలో మోత బరువు!...

ఆరడుగులకు పైబడిన ఆకారం కొంత ముందుకు వంగి మంచి ఊపులో!

ఒక లయకు అలవాటైన అడుగులు. ఒక పద్ధతిగా ముందుకు పడుతున్నాయి వేగంగా 'టక్ టక్' మని శబ్దం చేస్తూ!

పాతిక సంవత్సరాలకు పైగాసరిహద్దుల్లో భారతదేశ సంరక్షణా బాధ్యతను నిర్వహించామన్న సంతృప్తి...తాను పుట్టి పెరిగిన మట్టిని పీల్చిన గాలిని మనుషులను మళ్ళీ కలుసుకొంటున్నామన్న ఆనందమూ ఆ ముఖంలో పువ్వులై పూచి పరిమళిస్తున్నాయి.

గంట క్రితమే పేటలో బస్సు దిగాడు అంకయ్య. తన ఊరు చేరుకోవడానికి అక్కడ మరొక బస్సు ఎక్కాలి. "ఈ ఎర్రబస్సులు ఎప్పుడొస్తాయో?...ఎప్పుడు పోతాయో? వాటికే తెల్దు." అన్న మాటలు బస్టాండులో చెవిలో పడ్డాయి. తనలో తాను నవ్వుకొన్నాడు. "ఎదురు చూస్తూ ఇక్కడ నిలువుగాళ్ల మింద నిలబడి నంత సేపు నడిస్తే బస్సు వచ్చేలోగానే ఊరు చేరుకోవచ్చు" అనుకొన్నాడు. ఊరి దారి బట్టి నడుస్తున్నాడు.

మరి కాసేపటిలో దిఙ్మండలంలో దిగిపోబోతున్న సూర్యుడు పడమటి దిక్కులో తేలియాడుతున్న మబ్బులకు కెంపులు పులిమాడు. లోకాన్ని ఆవరించపోతున్న చీకటికి భయపడినట్లు పక్షులు గోల చేస్తున్నాయి. అప్పుడు అంకయ్య ఊరి ముందర చెరువు మొరవలో నడుస్తున్నాడు.

ఊరి ముందర నాయన చెరువును...ఆ చెరువు మొరవను చూసేసరికి అంకయ్యకు

అడుగుముందుకు పడలేదు. పాతిన నిలువురాయిలా నిలబడ్డాడు. కనురెప్పలు కర్తవ్యాన్ని ఒక్క క్షణం మరిస్తే శూన్యంలోకి వెళ్ళిన చూపులు మనస్సుని గతంలోకి నెట్టేశాయి. గత స్మృతి కొరడా దెబ్బతిన్న మనస్సు ఒకే ఒక్క క్షణంలో ఇరవై అయిదు సంవత్సరాల కాలాన్ని దాటి వెళ్ళిపోయింది.

ఆరోజు కనుచీకటి ఆవరిస్తూ ఉంది. తాను అడవి నుండి ఆవుల్ని ఇంటికి తోలుకొని వస్తున్నాడు. అదే మొరవలో ఆవులు నడుస్తున్నాయి. అంతలో ఎక్కడ పొంచి ఉండిందో ఒక చిరుత. ఆల మంద మీద పడింది. ఆవులు బెదిరి చెల్లాచెదురై మోరలు సాచి తోకలు పైకెత్తి దిక్కుకొకటయ్యాయి. తాను గోడను కరుచుకొన్న బల్లిలా ఒక చెట్టును వాటేసుకొన్నాడు. ఊపిరి బిగబట్టి చెట్టులో చెట్టయ్యాడు. చేతికందిన అవకాశం చేజారి పోతే చిరుత చిందులు తొక్కుతూ...ముంగాళ్లను నేలకేసి కొట్టూ...గాండ్రిస్తూ అడవిలోకి వెళ్లింది.

తనకు ఆ దడ తీరేసరికి అర్ధగంటకు పైబడింది. అప్పుడు వాటేసుకొన్న చెట్టును విడిచి పెట్టాడు. 'మళ్లీ అదెక్కడొచ్చి మింద పడుతుందో' అని బిత్తర చూపులు చూస్తూ ఊళ్లోకి పరుగందుకొన్నాడు. ఈలోగా...

అటూ ఇటుగా చెల్లా చెదురైన ఆవులు కొన్ని ఇల్లు చేరాయి. కొన్ని నాయుడోళ్ల జొన్న చేనిలో పడ్డాయి. పొట్టకర్ర మీద జొన్నచేను. నవనవలాడుతూ ఉంది. ఆ చేని మీద పడిన ఆవులు మేసినంత వరకు మేశాయి. తొక్కినంత వరకు తొక్కాయి. ఆ తర్వాత తీరిగ్గా ఇల్లు చేరాయి.

తాను ఇల్లు చేరే సరికి అక్కడొక పెద్ద జాతర జరుగుతూ ఉంది. ఆ జాతర తన రాకతో శ్రుతి మించింది.

"అయ్యాయ్యా! మా యబ్బతో దేముడి సాచ్చిగా నిజం చెప్తా ఉండా. నాయిన చెరువు మొరవలో సిర్తగాడొచ్చి గొడ్లమింద పడె. అవ్విబెదిరి దిక్కు కొగిటాయ. నేనేమో చెట్టుకు కర్చుకోని పొయ్‌నా. ఇంక నన్నేం చెయ్యమంటారు మీరే చెప్పండయ్యా?... చేతులెత్తి మొక్కతా. ఈతప్పట్టా కాసుకోండయ్యా?" అని ఏడ్చి మొత్తుకొన్నా కాళ్లా వేళ్లా పడి బ్రతిమాలినా లాభం లేక పోయింది.

"చిర్తగాడొస్తే నిన్నెట్లా యిడ్సి పెట్టిందిరా నీయమ్మ తక్కువ జాతి నా కొడకా!" అని తిట్టిన తిట్టు తిట్టకుండా రాతి కూసానికేసి కట్టేశారు. మక్కెలిరగ తన్నారు. తన పరిస్థితి కుక్క నోటికి చిక్కిన కండే అయింది.

తన మాటల్ని నమ్మిన కొందరు మాత్రం 'అయ్యో! పాపం!' అంటూ నిట్టూర్చారు.

"చేతికందిన పైరు నోటి కందకుండా పోతే ఎవురికి మాత్రం కడుపు రగల్దు? ఈ లోతు బావల్లో రేత్రనక పొగులనక బానకు బాన తోలి పండించిన పంట. చెమట గార్చి పండించినోడికి తెలిస్తింది ఆ బాద!" అని కొందరు నాయుడోళ్లకు వత్తాసు పలికారు.

ఆ రాత్రి తనకు కంటిమీద రెప్ప పడలేదు!

తన తప్పేమీ లేకపోయినా చావ కొట్టినందుకు నాయుడోళ్ల మీద కసి, రాతి కూసానికేసి కట్టేసి కొట్టినా పల్లెత్తు మాట పలకని శిరిపి రెడ్డోళ్ల మీద అక్కసు. 'అదే వాళ్ల బిడ్డయితే?' అన్న ఆలోచన మనసులో మెదిలితే బాధ.

తల్లి ఎవరో తెలియదు. తండ్రి ఎవరో తెలియదు. తనను ఈ లోకానికి అప్పగించి వాళ్లేమయ్యారో తెలియదు.అడిగే ఊహ అసలే లేదు. గాలికి పుట్టినట్టుగా ...గోగుపుల్లలా సన్నగా...ఎండిన కరవాడులా కంపుకొడ్తూ...గజ్జి కుక్కలావొళ్లంతా జిడ్డు కారుస్తూ...చీమిడి ముక్కుల్లో తొంగిచూస్తూ ఉంటే వీధుల్లో దేబిరిస్తూ తిరిగాడు. ఏ తల్లి అయినా దయ తలిచి పిలిచి అంత విదిలిస్తే అదే విందనుకొన్నాడు. లేకుంటే రెండు దోసిళ్ల నీళ్లతోఆకలిని లాలించి ఏ పంచ మీదనో పడి నిద్రపోయాడు.

అయితే కాలం తనతో కలిసి నిద్రపోలేదు.

ఉన్నవాడికి ఒక్క ఇల్లయితే అడక్క తినే వాడికి అరవై ఇండ్లు. ఊళ్లో వాడలో ఇండ్లన్నీ తనవే అయ్యాయి. ఇంటికొక కూడు.ఇంటి కొక కూర. పూటకొక ఇల్లు. కాసంత వొళ్లు చేసి ముద్దుగా తయారయ్యాడు. అప్పుడు అంత అన్నం మొగాన విదిలిస్తూనే "ఒరే అంకా! ఇంక యాడన్నా ఒక పని చూసుకోరాదా?" అని ఊళ్లో అమ్మలక్కలు అన్నారు.

ఈ మాట శిరిపిరెడ్డోళ్ల చెవుల్లో పడ్డట్టుగా వాళ్ల కన్ను తన మీద పడింది.

'రారా అంకా!' అని పిలిస్తే వెళ్లాడు. మూరడు తుండుగుడ్డ ముఖాన కొట్టి "గొడ్డు గోదనుమేపరా!" అంటే మేపాడు. వేళకంతగా పెట్టిన సంకటికే ఆ ఇంటికి దత్తమయ్యాడు. ఏ పని చెప్పినా విసుగు నసుగు లేకుండా చేశాడు. చేస్తే ఏమైంది?

రాతి కూసానికేసి కట్టేసి కొట్టా ఉంటే నీళ్లు నములుతూ నిలబడి అదొక వింతగా చూశారు. అదే వాళ్ల బిడ్డయితే?...

పశువుల కొట్టంలో పడుకొన్న తన గుండెలు కుత కుత ఉడికాయి! అప్పుడు ఆలమంద మీద పడిన చిరుత తన మనస్సులో మెదిలింది. ఒక్కవూపులో ఎగిరి ఆ ఇంట్లో దూకి చిరుతలా గొంతులు కొరికి నెత్తురు తాగితే?- తన కసి తీరుతుంది. అయితే అది కాని పని అని తోచే సరికి కాళ్లెత్తికడుపులో పెట్టుకొని పడుకొన్నాడు.

అయినా నిద్ర పట్టలేదు.

ఊరు నిద్ర వొడిలోకి జారుకొనింది. నాయుడోళ్ల జొన్నచేనిలో కడుపార మేసిన ఆవులు అరమోడ్పు కన్నుల్తో హాయిగా నెమరేస్తున్నాయి. మెల్లగా పైకి లేచాడు. వీధిలోకి నడిచాడు. దిక్కులు చూస్తూ అలవాటుగా తల పైకెత్తాడు. నల్ల రేగడి నేలపై చల్లిన తెల్లని జొన్న గింజల్లా ఆకాశంలో చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. వాటితో పోటీ పడ్తూ తన మనస్సులో ఒక ఆలోచన. కొట్టంలోకి వెళ్లి ఒక పలుపును చేతికి తీసుకొన్నాడు.

దెబ్బలు తిన్న వొళ్లు. తీపులు తీస్తూ ఉంది. అయినా ఒక ముంపు మీద నడిచాడు. ఊరికి ఉత్తరంగా నాయుడోళ్ల టెంకాయ తోపు. ఆ తోపు మధ్యలో నిలబడి దిక్కులు

కలయ చూశాడు. మనుషులే కాదు చెట్లు కూడా నిద్రపోతున్నాయి. గోచీపైకెగ చెక్కాడు. కొట్టంలో నుంచి తెచ్చిన పలుపును కాళ్లకు బందంగా తగిలించుకొన్నాడు. కన్ను మూసి తెరిచే లోపల టెంకాయ చెట్టు పైకి ఉడతలా పాకాడు. పూతా పిందెతో సహా దూసి కింద పోశాడు. గబ గబ కిందికి జారాడు. ఇంకొక చెట్టు ఎక్కాడు. అదే పని చేశాడు. ఆ తర్వాత మరొకటి!... మరొకటి!!...

కాళ్లు పీకుతున్నాయి. అరచేతులు మండుతున్నాయి. భుజాలు ఊడి పోతున్నాయి. పైగా దెబ్బలు తిన్నవొళ్లు. పచ్చి పుండై నొప్పి. స్వాధీనం తప్పుతున్న శరీరం! అయినా తీరని కసి. ఆరని ద్వేషం. క్షణక్షణానికీ పట్టుదల పెరిగింది. ఎక్కి దిగని మానులేదంటూ ఎక్కి దిగి కాయ పిందెతో సహా దూసి పోశాడు.

అప్పటికి మనస్సు కుదుట పడింది!

అంతే! మళ్లీ ఊళ్లో అడుగుపెట్టలేదు. అక్కడి నుండి బయలుదేరి ఏదారి కనిపిస్తే ఆ దారి వెంట నడిచాడు. ఎవ్వరే పని చెప్తే ఆ పని.చేశాడు. పెట్టే తిన్నాడు. తిట్టే విన్నాడు. తన అదృష్టం బాగుండి ఎవరో ఒక పుణ్యాత్ముడు తన కండ బలాన్ని...కండల్లో దాగిన గుండె బలాన్ని గుర్తించి 'మిల్టిరీలో చేరరాదా?' అంటే చేరాడు.

ఇరవై అయిదు సంవత్సరాలు మిలిటరీ కొలువు కొలిశాడు. మీసాలు పెంచాడు. పై అధికారులు తన సామర్థ్యాన్ని మెచ్చుకొంటే తృప్తిగా మీసాల్ని మెలేశాడు. 'నీలాంటి బిడ్డను కన్నందుకు దేశ మాత నిజంగా గర్విస్తూ ఉంది. నీ జన్మ ధన్యం. ఇక నీ సేవలు చాలయ్యా!' అంటే తన వాడను...తన వాళ్లను చేరుకోవడానికి బయలుదేరాడు.

చెరువు మొరవలో కదిలీ మెదలకుండా నిలబడి గతంలో విహరిస్తున్న అంకయ్య చెవిని రాసుకొంటూ...కీస్‌మని అరుస్తూ ఒక తీతువు పిట్ట. అంకయ్య ఉలిక్కి పడ్డట్టు ఈ లోకంలో పడ్డాడు. భారంగా నిట్టూర్చాడు. కొన్ని నిముషాల క్రిందట మనస్సును ఆవరించిన ఆనందం స్థానంలో ఆవేదన...చికాకు! అయినా కాలం తెచ్చిన మార్పు తన్ను వెన్ను తట్టి పురికొల్పుతుంటే ముందుకు సాగాడు.

వాడలో అడుగుపెట్టే సరికి...

వీధుల్లో ఆడుకొంటూ ఉండిన పిల్లలు 'పోలీసోడు!...పోలీసోడు!!''అని అరుస్తూ గుడిసెల్లోకి దూరుకొన్నారు. గుడిసెల్లో ఉన్న ఆడవాళ్లు బయటికొచ్చి ఆ ఆకారాన్ని కండ్లు ఇంతింతచేసి వింతగ చూశారు. పిల్లలు తల్లి చాటులో నిలబడి తొంగి తొంగి చూశారు. వయసు మళ్లిన ముసలీ ముతక కండ్లుచికిలించి చూశారు!

అంకయ్య అందరి వైపు ఒకసారి కలయ చూశాడు. చిరునవ్వు పెదాలపై కన్నీకటితో పోటీ పడుతుంటే హుందాగా ముందుకు నడిచి "గంగులు మామా! నేను మీ అంకణ్ణి గద మామా!' అన్నాడు.

గంగులు అప్పటికీ పోల్చుకోలేక 'ఏ అంకడు?' అన్నట్లుగా చూస్తుంటే-

"శిరిపిరెడ్డోళ్ల ఇంట్లో ఆవులుమేపుతూ ఉండిన అంకణ్ణి గదా?" అన్నాడు.

"ఒరే వారే!...పిల్ల నాయాలా? నువ్వంట్రా. చీమిడి కార్చుకుంటా చింతచెట్ల కింద తిరగతా ఉంటివే?...ఎంత మారిపాయ్‌నావురా? ఉణ్ణెట్టుండి నువ్వు అతీగెతి లేకుండా పోతే ఏబాయి పాలో గుంటపాలో అయిపాయ్‌నాడను కుంటిమి గదరా?...రారా నాయినా రా?" అంటూ ఆప్యాయంగా పిలిచాడు గంగులు.

కుర్రకారు కండ్లు చికిలించి సందేహంగా చూశారు. గుర్తించిన వాళ్లు కొందరు ఆనంద పడ్డారు. కొందరు ఆశ్చర్య పడ్డారు. ఆనాటి నుంచి అంకయ్య కొందరికి 'మిలిట్రీ అన్న' అయ్యాడు. మరికొందరికి 'మిలిట్రీ మామ!' అయ్యాడు. అంకయ్య మాత్రం ఎవరు ఎలాపిలిచినా పలికాడు. పిలిచినా పిలవక పోయినా స్వయంగా తనకు తానుగా ఏ ఇంట్లోనో దూరి వేళకంత తిన్నాడు. తింటున్నా...తిరుగుతున్నా తీవ్రంగా ఆలోచించాడు.

తాను వాడను వదిలిపెట్టి పాతికేండ్లకు పైబడింది. అప్పుడు పది గుడసెలు. ఇప్పుడు పాతిక గుడిసెలు. ఆ గుడిసెల మీద కప్పులేదు. ఒక్కడి వొంటిమీద తులం కండలేదు. ఎవడిని చూసినా ఎముకల గూటికి చర్మాన్ని అతికించినట్లుంది. పిల్లల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. చదువుకొనడానికి బడి లేదు. రోగం రొష్టు వస్తే ఆస్పత్రి లేదు. ఏం బ్రతుకులో ఎదుగూ బొదుగూ లేని ఏబ్రేసి బ్రతుకులు!...

వాడలో ఈ మూడు దశాబ్దాల్లో జరిగిన మార్పు ఏమంటే? తనకు తెలిసిన వాళ్లు కొంతమంది చచ్చారు. తెలియని వాళ్లు కొంతమంది పుట్టారు. పోయిన వాళ్ల బాధ్యతల్ని వీళ్లు నెత్తికెత్తుకొన్నారు. ఇంతేనా? ఈ పద్ధతికి అంతం లేదా? ఈ జీవితాలకు విముక్తి లేదా?

అంకయ్య ఆలోచిస్తూ వాడలో నిలబడి ఊరివైపు చూశాడు.

అక్కడ మిద్దెలు మేడలయ్యాయి. పూరిండ్లు మిద్దెలయ్యాయి. అంకయ్య తల పంకించాడు.

ఆ ఊరికి చుట్టు పక్కల నాలుగైదు ఊళ్ళు. ఊరూరికి ఒక హరిజన వాడ. ఊరి అడుగుజాడల్లో వాడ నడవాల్సిందే. లేకపోతే వాడకు పూట గడవదు! ఎన్నాళ్లిట్లా? ఎన్నేండ్లిట్లా?? జరిగినంత కాలం జరిగింది. జరిగిన కాలాన్ని గురించి ఆలోచిస్తే ఒరిగేదేమీ లేదు. అయితే ఇంక జరగాల్సిందేమి?

అందుకే అంకయ్య ఆ హరిజన వాడలన్నీ కాలికి బలపం కట్టుకొని తిరిగాడు. అందర్నీ ఒకచోట చేర్చాడు. ఒక రాత్రి కాదు. రెండు రాత్రులు కాదు. ప్రతి రాత్రీ అందరు ఒక చోట చేరారు. అంకయ్య అభిప్రాయాల్ని విని కొందరు ఔనన్నారు. కొందరు కాని పనికి కష్టం జాస్తి అని పెదవి విరిచారు. అయినా అంకయ్య 'ఏది ఏమైనా అందరు ఒక దారిన తప్పక నడవాల్సిందే!' అని పట్టుపట్టాడు. పండు వొలిచి అరచేతిలో పెట్టినట్లు వాళ్ల బతుకులెట్లుండాయో విడమరిచి విశదీకరించాడు. తమకు జరుగుతున్న అన్యాయాల్ని. ఎదుర్కొనవలసిన కర్తవ్యాన్ని ఎత్తి చూపాడు. అందరు విన్నారు. 'ఔగదా మరి?' అని

ఒకరితో ఒకరు అనుకొన్నారు. అందరు ఒక మాట మీద నిలబడాల్సిందే! అని నిర్ణయించు కున్నారు. అంకయ్య ఏనుగునెక్కినంత సంబరపడ్డాడు.

ఊరికి కొంత దూరంలో అయిదెకరాల పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకొన్నారు. అందరు కలిసికట్టుగా రాత్రింబవళ్ళు కష్టపడ్డారు. అందంగా దాదాపు వంద గుడిసెలు తయారయ్యాయి. అంతకు మునుపు రాళ్ల రప్పల్తో, ముండ్ల పొదల్తో కాలూన లేకుండా ఉండిన ఆ ప్రాంతంలో ఇప్పుడు వరసబెట్టి కట్టిన గుడిసెలు వొదిగిన కోడిపెట్టల్లా కనిపిస్తుంటే చూడ ముచ్చటగా ఉన్నాయి. ఒక్కొక్క కుటుంబం ఒక్కొక్క గుడిసెను ఆక్రమించుకొనింది. ఆ కాలనీకి ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి పేరు పెట్టారు.

అయినా వాళ్ల ఎత్తులు పారలేదు!

హరిజనులందరు ఒక్కటైతే వచ్చే ఇక్కట్లను ఊహించుకోలేని అమాయకులు కారు అగ్రవర్ణస్థులు. అందుకే వాళ్ళు తలకింత అని చందాలు వేసుకొన్నారు. మండలాధికార్ని మంచి చేసుకొన్నారు.

ఇరుసుకు కందెన పెడ్తే చక్రం సులువుగా గిరగిర తిరుగుతుంది. అధికార్ల చేతికి ఆముదం రాస్తే జరగవలసిన పనులు చక చక జరిగిపోతాయి. ఒక రోజు మండలాదికారి మంది మార్బలంతో వాడ ముందు ప్రత్యక్షమయ్యాడు.కలెక్టరుగారి ఉత్తర్వులన్నాడు. ఖాళీ చేసి తీరాల్సిందే! అన్నాడు. దేశంలో భూమి అన్యాక్రాంతమై పోతున్నదని ఆగ్రహించాడు. క్రమశిక్షణ బొత్తిగా లేకుండా పోతున్నదని ఆక్రోశించాడు. ప్రజలు బాధ్యతారహితులై ప్రవర్తిస్తున్నారని ఆవేదన పడ్డాడు. బుల్‌డోజర్ పెట్టి కొట్టించేస్తా నని బెదిరించాడు. ఎవ్వరు తన మాటల్ని ఖాతరు చెయ్యకపోయేసరికి వెనక్కు ముందుకు ఊగాడు. వెనకా ముందు ఆలోచించకుండా అన్నంత పనికి తయారయ్యాడు.

అంకయ్య కడుపు రగిలింది. కోపంతో కనుబొమ ముడిపడింది. చేతులు ముడుచుకొని కూర్చుంటే చేటు తప్పదనుకొన్నాడు. కాలుగాలిన పిల్లిలా ఇంటింటికి తిరిగాడు. ఇంటిల్లి పాదినీ రమ్మన్నాడు. పిలుపుతో క్షణాల మీద అందరు ఒక చోట చేరేసరికి అంకయ్య వాళ్లవైపు తిరిగాడు. అతని కండ్లల్లో నిప్పులు కురుస్తున్నాయి.

"ఇప్పుడు మీరంతా వొంట్లో చీమూ నెత్తురుంటే శ్రద్ధగా నా మాట వినండి.చచ్చేది నిజం. బతికేది అపద్ధం.. ఇప్పుడు మనంకానీ గాజులు తొడుక్కున్నట్లు మూల కూర్చుంటే ముండమోసి పోతాం. అదేం కుదరదు. నామాట నమ్మండి. చెప్పినట్టు వినండి. నాదేముంది. నేనుండే దొక్కణ్ణి. నాకు వెనకా ముందు ఎవ్వరూ లేరు. అందరికంటే ముందుగా నేనే బుల్‌డోజర్ కడ్డంగా పడుకుంటా! నా తర్వాత మీరందరు పడుకోండి. నేను చస్తేనే కదా మీరందరూ చచ్చేది. ఎట్లా చంపుతారో చూద్దాం! ఎట్లా చస్తామో చూద్దాం!' అంటూ తుపాకి గుండులా దూరి బుల్ డోజర్ కడ్డంగా పడుకొన్నాడు. అంకయ్య పడుకొనేసరికి ఆ గుడిసెల్లో ఆడా, మగా, పిల్లా, జెల్లా వరసగా కట్టకట్టినట్లు బుల్‌డోజర్ కడ్డంగా

పడుకొన్నారు.

అది చూసి మండలాధికారి శివతాండవం చేశాడు. ఆ శివతాండవం ప్రళయ తాండమైనా ఆగుంపుకు చీమ కుట్టినట్లనిపించక పోయే సరికి ఎగిరి జీపులో పడ్డాడు. తిరిగి మళ్లీ చూడకుండా టౌనుకు వెళ్లాడు.

సాయుధులైన పోలీసులు దిగారు.

చంకన కేమెరాలు తగిలించుకొని వాళ్ళ వెనుకనే జర్నలిస్ట్లు దిగారు అంకయ్యా అందించిన వార్తతో!

పోలీసులు గుడిసెవాసుల్ని బెదరగొట్టడానికి ప్రయత్నాలు చేశారు. పత్రికల వాళ్లు ఫోటోలు తీశారు. ఆమరుసటిరోజే "గుడిసెలపై గూండాయిజం! ఇదేనా సోషలిజం?' అని ప్రముఖంగా ప్రకటించారు.

గుడిసెల్ని ఖాళీచేసే ప్రయత్నం వాయిదా పడింది.

గుడిసెవాసులంతా ఒకటై 'జై బోలో అంకయ్యకు!' అన్నారు.

గ్రామస్థులు మాత్రం ఏమీ చేయలేక కల్లు తాగిన కోతుల్లా కదనుతొక్కారు. 'ఎట్టయినా సరే! వీళ్లందర్నీ ఒకపట్టుబట్టి చూడాల్సిందే! అనుకొన్నారు. అయితే అవకాశం దొరకాల కదా? అంతవరకు ఓపిక తప్పదు కదా? నిదానమే ప్రధానంఅనుకొన్న జనులు హరిజనుల్ని మామూలుగానే పనిపాటకు పిలిచారు. హరిజనులు అడ్డం చెప్పకుండా పోయారు.చెప్పిన పనుల్ని చెప్పినట్లు చేశారు. తమకు రావలసింది అడిగి తెచ్చుకొన్నారు. పొద్దు పుడుతూ ఉంది. పోతూ ఉంది. అయినా ఒకరి మీద యింకొకరికి ద్వేషం. నిప్పు లేకనే రగిలింది. రగిలి రగిలి ఎప్పుడు రావణాసురుడికాష్టంగా మారుతుందో అని జనులు...హరిజనులు ఎవరి ఆలోచనల్లో వాళ్లు! సాకు దొరికితే చాలు. సాధించాలని తాపత్రయం!

హరిజనులకు చేదబావి అప్పుడూ లేదు. ఇప్పుడూ లేదు.

ఇంత కాలం వాళ్లు మోట బావుల నీళ్ల మీదే ఆధారపడ్డారు. "ఆ నీళ్ళ మిందనే దెబ్బ కొడ్తే? తల దిరిగి కాళ్ల దగ్గరికొస్తారు కొడుకులు!" అని ఆలోచించారు ఊళ్ళో వాళ్లు. అయితే ఆ కొట్టే దెబ్బ దెబ్బ కొట్టినట్లనిపించ కూడదు. కనిపించ కూడదు. ఆ దెబ్బతో నాయాండ్లు గుక్క దిప్పుకోలేక గిలగిల్లాడిపోవాల!" అని ఆలోచించి ఆలోచించి అందరుఒక నిర్ణయానికి వచ్చారు. ఆ ఆనందంతో చంకలు తట్టుకొన్నారు.

మోట తోలేటప్పుడు ఎద్దులు మోటబారిలో పేడ వేస్తాయి. ఆ పేడను బారి పక్కన్నే కుప్పతోసి పెట్టుంటారు. మోట విడిచి పెట్టినప్పుడా పేడంతా ఎత్తి బావి పక్కన్నే దిబ్బేస్తుంటారు. కానీ యిప్పుడా పేడను మోటబావి మొగదల కుప్పతోసి పెట్టారు. వాడలో ఆడది కడవ చంకన బెట్టకొనికంట పడ్తేచాలు. ఎడం కాలితో ఆ పేడను కొంచెం కొంచెంగా దోనేలో తోశారు. మోటబాన దోనెలో కుమ్మరిల్లితే నీళ్ళన్నీ పేడమయమే!

ఆ స్త్రీ గట్టున నిలబడి కాలవవైపు చూసింది. కలిపిన కళ్లాపి నీళ్ళులా కాలువలో నీళ్ళు పగలు పడ్తూ పోతున్నాయి. చూస్తూ నిట్టూర్చింది. ఆపై మోటతోలుతున్న మనిషి వైపు చూసింది. కండ్లల్లో తృప్తి తొణికిసలాడుతున్నా తనకేమీ తెలియనట్లుగా, ఏమీ పట్టనట్లుగా తానేమో తన పనేమోగా ఆవ్యక్తి మోట తోలుతున్నాడు. మనస్సు చివుక్కు మనింది. చివుక్కుమన్నా, కలుక్కుమన్నా ఉలిక్కిపడలేని కడజాతి, చేసేది లేక గిరుక్కున వెనక్కు తిరిగింది. చరచర ముందుకు నడిచింది. ఇంకొక్క బావి దగ్గరికి వెళ్ళి నిలబడింది. అక్కడా అంతే!

అక్కడ మాత్రమే కాదు- ఆ ఊళ్ళ క్రింద బావుల దగ్గరంతా అంతే!

పాపం! ఆ యిల్లాలు నిట్టూరుస్తూ వట్టి కడవతో వాడ చేరింది. చుట్టి చుట్టి వచ్చి చుట్టు గుడిసెలో కూలబడింది. కన్నీళ్లతో కడవ నింపలేక కలవరపడింది. తాగడానికి గుక్కెడు నీళ్లు లేక ఆ గుడిసెలో పిల్లా జెల్లా నకనకలాడారు.

ఆ ఒక్క గుడిసెలోనే కాదు- వాడలో గుడిసెల గతి అంతా ఇంతే!

అయితే ఇంకేం చెయ్యాలని వాడలోని వాళ్ళంతా చేరి తర్జనలు భర్జనలు పడుతున్నారు.

"వాళ్ల పిలిస్తే పనీ పాటకు పోయ్యేది మానేస్తాం" అన్నాడొకడు.

"మానేస్తే తిండి లేకుండా నిగిడి చస్తాం?" అన్నాడింకొకడు.

"ఇప్పుడు మాత్రం తాగేదానికి నీళ్ళు లేకుండా చస్తా వుండ్లేదో!" అని మొదటి వాడిని సమర్థించాడు మూడోవాడు.

"పనులు మానేదీ వద్దు. పస్తులు పడి చచ్చేదీ వద్దు. నీళ్ళు లేక అల్లాడేదీ వద్దు" అంకయ్యా నోటి మాట రాతికి టెంకాయ కొట్టినట్టు వినిపించింది.

"అదెట్లా కుదిర్తింది?"

"ఎందుకు కుదరదు? ఊళ్లో చేదబావిని తవ్వింది మనం. అయినా మనం ఆ నీళ్ల చేదుకోవడానికి లేదు. ఈ పాయకట్లో కింద దిగుడు బావులన్నీ తవ్వింది ఎవరు మన తాతలో ముత్తాతలే కదా?. అయినా ఆ బావుల్లో మనం దిగడానికి లేదు. కనీసం రెండు కడవల నీళ్ళు మోటతోల్తా ఉంటే తెచ్చుకోవడానికి లేదు. ఎంతకాలం ఇట్లా అగచాట్లు పడేది?" అని నిలదీసి అడిగాడు అంకయ్య.

"అయితే యిప్పుడేం చెయ్యాలంటావ్?"

"మన కాళ్ళ మీద మనం నిలబడాలి. మన నీళ్ళు మనం తాగాలి. అంటే మన చేదబావి మనం తవ్వుకోవాలి!"

"అది మన వల్ల అయ్యే పనేనా?"

"ఎందుగ్గాదు? ఇన్ని బావులు తవ్వినవాళ్లం. మన బావిని మనం తవ్వుకోలేమా?"

"వాళ్ల దగ్గిర దుడ్లుండాయి"

"మన దగ్గిర శక్తి ఉంది."

ఒకరి మొగం ఒకరు చూసుకొన్నారు. చూపులు చూపులు కలుసుకొన్నాయి. ఆ చూపుల్లో తిరుగులేని నిర్ణయం! పారా పలుగు చేతబట్టి వాడంతా పాలోమని కదిలింది.

వాడకు ఈశాన్యమూలగా వంకదారి. ఆ దారి పక్కన్నే మర్రిమాను. ఈ మానికింద చేరారు. కొందరి చేతుల్లో పారలున్నాయి. కొందరి చేతుల్లో గడ్డపారలున్నాయి. మరికొందరి చేతుల్లో తట్టలున్నాయి.

అప్పుడు అంకయ్య గడ్డపార చేతికందుకొన్నాడు. 'జై గంగా భవానీ!' అంటూ గడ్డపారను శక్తి కొద్దీ పైకెత్తి మొదటి ఘాతం వేశాడు. అంతే! పని ప్రారంభమయింది. కొందరు పారల్తో మట్టిని తట్టల కెత్తుతున్నారు. తట్టల కెత్తిన మట్టిని కొందరు కొంత దూరంలో కుప్ప పోస్తున్నారు.

చేదబావి తవ్వకం చక చక సాగిపోతూ ఉంది.

ఈ వార్త క్షణాలమీద ఊరు చేరింది.

"ఆ!...మూగోడు అబ్బా అనే కాలానిక్కదా! ఆ రాళ్ల రప్పల్లో బాయి తొవ్వితే నీళ్ల పడిన కాలానిక్కదా?"అని ఊరు తేలిగ్గా నవ్వేసింది.

"రాళ్లో రప్పలో! ఏమైనా సరే దీని అంతు తేల్చుకోవాల్సిందే!" అని ఉడుం పట్టుతో ఉపక్రమించింది వాడ.

అయితే తాగడానికి నీళ్లు?-

ఆ నీళ్ల కోసరమే కదా చేదబావిని తవ్వుతున్నారు. చేదబావిని తవ్వాలికదా? తవ్విన బావిలో నీళ్ళు పడాలికదా? అంతవరకు? అదే సమస్యగా పరిణమించింది.

రాత్రిపూట దిగుడుబావుల్లో దిగి దొంగతనంగా అయినా నాలుగు కడవల నీళ్ల తెచ్చుకుందామంటే- ఊళ్లో వాళ్లు ముందు జాగ్రత్తగా యింటికొక్క మనిషిగా మోటబావుల దగ్గర కావలి కాయనట్టే కాస్తున్నారు. ఇక చేద బావుల సంగతి సరేసరి!

వాడల్లో ఆడవాళ్లు పాపం! కోడి కూతతో నిద్రలేచారు. అయిదారు మైళ్లు నడిచారు. అక్కడ గుంటల్లోనో, చెరువుల్లోనో లేకుంటే మోట బావుల దగ్గర్నో రెండు కడవలు కావిడి గట్టి తెచ్చారు.

కుర్రకారు అడవుల మీదపడి కుందేటి కొమ్ముల్ని తెచ్చారు. కుందేటి కొమ్ములంటే? చూడటానికవి నల్లేరు కాడల్లా సన్నగా ఉంటాయి. అయితే నల్లేరు కాడల్లా పొడుగ్గా పెరగవు. జానెడు పొడుగు కటోయిటోగా గుబురుగా పెరగతాయి. వాటిని నములుతుంటే పులుపు తీపు కలగలిసినట్లుంటుంది. అయితే నమిలిన తర్వాత ఎంత శ్రమ పడినా రెండు మూడు గంటల వరకు నోట్లో తడి ఆరదు. ఎండాకాలం అడవుల్లో పశువుల కాపర్లకు యిదే పసరువేది. వాడలో పిల్లోళ్ళు అడవుల్లో ఎంత దూరమైనా వెళ్ళి కుందేటి కొమ్ముల్ని సేకరించారు. తెచ్చి చేదబావి తవ్వుతున్న వాళ్లకందించారు.

అది కూలి సేద్యం కాదు. సొంత సేద్యం. ప్రతి వొక్కడు వొళ్లు వొంచి పని చేస్తున్నాడు. రాత్రింబవళ్లు తెలియకుండా ఒక పట్టుదలతో పని చేస్తున్నారు.

నెల తిరగలేదు. శ్రమశక్తి తరగలేదు. బావి ఆరేడు మట్లు తెగింది. అక్కడ గంగా భవాని ప్రత్యక్షమయింది. ప్రళయ తాండవం చేస్తూ ప్రత్యక్షమయింది.

వాళ్ల ఆనందానికి ఆకాశమే హద్దు!

జనులు తాగే నీళ్లల్లో పేడ కలిపారు. హరిజనులు కొత్త నీళ్లను కడవలకు తోడి పసుపు కలిపారు!

బావలమీద మరదండ్లు... మరదండ్ల మీద బావలు... మామల మీద అల్లుళ్లు... అల్లుళ్ళ మీద మామలు ... పిల్లలు వావివరుసలు పాటించకుండా వరసబెట్టి అందరి మీదా వసంతం చల్లుకొన్నారు. 'జై బోలో అంకయ్యకు! జై బోలో గంగా బవానీకి!' అని అరుస్తూ ఆడారు. గొంతెత్తి ఏలపదాలు పాడారు. ఏమొగాన్ని చూసినా మొగమంతా వ్యాపించిన వెన్నెల వెలుగు...కన్నుల్లో కాంతి....పెదవులపై చిరునవ్వు ....ఏ గొంతులో విన్నా ఏదో కూనిరాగం! వాళ్ళ విజయోత్సాహం ఒక ఉత్సవమే అయింది.

ఇది చెవినపడిన ఊరు చిన్నపోయింది!

తమ పాచిక పారలేదని ప్రయత్నాలు సాగలేదని ఊళ్లో ప్రతి గుండె తల్లడిల్లింది. ప్రతి మనస్సు ఆక్రోశించింది. "ఈ పూట బాయి తొవ్వుకొన్నారు. రేపు గుడి కట్టుకుంటారు. మళ్ళీ ఒక బడి పెట్టుకుంటారు. ఆ మిందట గుడిసెలు కట్టుకునే దానికి పోరంబోకు నేల కొట్టేసినట్టే సేద్యానికి బూములు సంపాయించు కుంటారు. అప్పుడు వాళ్ళ సేద్యం వాళ్లదయితింది. అప్పుడు మన గెతేం కావాల? అదోగెతే కదా? అట్లా కాకూడదనుకుంటే ఎట్టన్నా ఎదురు దెబ్బ తియ్యాల! అదెట్లా జరుగుతుందబ్బా?" అని ప్రతి మనిషి చాలా తీవ్రంగా ఆలోచించాడు.

అసలు వేడికి వాళ్ల ఆలోచనల వేడి తోడయినట్లుంది. ఆ వేడితో ఆకాశం కడిగి తోసినట్లైంది. కలికానికంత మబ్బు తునక కనిపించకుండా పోయింది.

ఆ ఏడాది చినుకు నేల రాల్లేదు!

వర్షాధారంతో బతికే ప్రాంతం. ఆ ప్రాంతంలో పడే వర్షం కూడా అంతంత మాత్రమే! అది ప్రతి ఏటా పడుతుంటేనే అంతో యింతో సాగుబాటు. ఒక ఏడు మట్టగిస్తే చాలు. పరిస్థితి మహా దారుణంగా తయారవుతుంది. తాగడానికి నీళ్ళుండవు. తాగడానికే లేకపోతే యిక పంటలకేముంటాయ్? పంటలు పండకపోతే తినడానికి తిండి కరువు. గొడ్డూ గోదకు మేపు కరువు.

ఆఏడాది వర్షం లేకపోయేసరికి ఆ ప్రాంతంపై కరువు రక్కసి దాడి చేసింది.

ఊళ్లో చేద బావులు మట్టసంగా ఎండిపోయాయి. ఆ ఊరికింద దిగుడు బావులు అడుగంటాయి. పైర్లు ఎండి ఎండిపోయాయి. తాగడానికి నీళ్ళు లేక దినగండం

నూరేండ్లాయుస్సుగా పరిస్థితి విషమించింది.

అయితే హరిజనవాడ చేదబావిలో మాత్రం చేదే కొద్దీ నీళ్లే!

ఊళ్లో వాళ్ల కన్ను ఆబావి మీద పడింది. పడ్తే ఏం చేయాలి? నీళ్ళివ్వమని అడగాలి! ఒకప్పుడు వాళ్లడిగితే వీళ్ళేం చేశారు? అది మనస్సులో మెదిల్తే అడగడానికి మొగం చెల్లలేదు. మొగం చెల్లకపోతే ఏం చేయాలి? ప్రాణం ఒకటి ఉందిగదా? దాని తీపి దానిది. పొగొట్టుకుంటే ఆ తీపిని పోగొట్టుకోవాలి! లేకుంటే ఊరొదిలి ఊరుగాని ఊళ్లకు వలస పోవాలి. కొంపా గోడూ, కయ్యా కాలవ వొదిలిపిట్టి పోవాలంటే మాటలా? అందుకే అభిమానాన్ని చంపుకొన్నారు. అంకయ్య దగ్గరికి వెళ్లారు.

వాళ్లు ఎందుకొచ్చిదీ అంకయ్యకు తెలుసు. ఏనాటికో ఒకనాటికి రాక తప్పదనీ తెలుసు. కానీ ఏమీ ఎరగనట్లే- 'కాకితో కబురంపితే వచ్చేవాణ్ణి కదయ్యా! ఇంతదూరం మీరు రావాలా?"అని అన్నాడు.

"అంకన్నా! మా బుద్ధి గెడ్డితినింది. మేం జేసిందేదో తప్పే. మా తప్పును మేము వొప్పుకుంటా వుండాం!" అందితే జుట్టు అందకపోతే కాళ్లు పట్టుకొనే తత్వం అందంగానే పలికింది.

"రామ!రామ! మీరేం తప్పు చేసినారయ్యా?-అట్లాంటి తప్పేదైనా కడజాతోడే చెయ్యాల. మీరు పెద్ద పెద్దోళ్ళు. తమ నోళ్ళల్లో యింత చిన్న చిన్న మాటలు రావడం ఏం బాగాలేదయ్యా?"

"చచ్చిన పాములేన్నే చావగొట్టే ఎట్రా?"

"తమరు మాట్లాడ్తా ఉండేది నాకేమీ తలకెక్కనంటా ఉండాదయ్యా!"

"తెల్నోడికైతే చెప్పొచ్చు. తెల్సీ తెల్నట్టు మాట్లాడ్తే ఏం చెయ్యాల?"

"పైన ఇదొక నిందనా?"

"ఇట్టామాటకు మాట పెంచుకుంటా పోతే వొచ్చిందీ లేదు వొరిగిందీ లేదు. గొంతు తడుపుకోను నీళ్లు లేకుండా గిలగిల్లాడి చస్తావుంటే కండ్లారా చూస్తానే నువ్వేమీ ఎరగనట్టే ఎకసక్కెమాడ్తే యింక మేమేమి మాట్లాడేదబ్బా?"

ఆ మాట చెవిన పడేసరికి అంకయ్యకు వొళ్ళు రగిలింది. "మేం చావలా? అప్పుడు మీరేం చేశారు?'అని నిలదీసి అడగాలనుకొన్నాడు. అయినా నిబ్బరించుకొన్నాడు.

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారు?"

"ఏమీ లేదంకన్నా! మీ బాయిలో మానావరిగా నీళ్లుండాయి కదా? కరంటు మోటారు పెట్టేసి పైపులైను లాగేద్దాం. మీకు చేదే పని తప్పుతుంది. మా పాణాలు గెట్టెక్కి గెడ్డన పడ్తాయి."

"ఎంత మాటెంత మాటయ్యా! కూలిచేస్తే కుండగాలు. లేకుంటే కడుపులు కాలే బతుకులు మావి. మాకెందుకయ్యా మోటార్లు, గీటార్లు. అంతపని చేసేస్తే, ఈ దొంగ

వెధవలు సుఖం మరిగిపోతారు. ఆ తర్వాత మీకు లేనిపోని తకరారు. మా చేతుల కష్టం మాకుంది. వెళ్ళిరండయ్యా, వెళ్ళిరండి!" అని రెండు చేతులెత్తి దండం పెట్టాడు.

వాళ్లు ఊళ్లో పెద్ద పెద్ద మనుషులు. అంకయ్య ముందుమాత్రం చిన్న చిన్న మనుషులై తలలు వంచారు. వంచిన తలెత్తకుండా నడిచారు. ఒకప్పుడు తమ ముందు చేతులుచాపిన మండలాధికారి ముందర నిలబడి తలలు పైకెత్తి చేతులు జోడించారు. జోడించిన చేతుల్ని జోడించినట్టే పెట్టుకొని జరిగింది జరిగినట్లు విన్నవించుకొన్నారు! ఇంక జరిగేదెట్లా!' అని మొత్తుకొన్నారు.

వాళ్లు కుయ్యో మొర్రో అని మొత్తుకుంటుంటే మండలాధికారి అరచేతులవైపు అలవోకగా చూసుకొన్నాడు. వాళ్ళు పూసిన ఆముదం పూత మాత్రం అన్ని పూతల వెనుక స్పష్టంగా కనిపిస్తుంటే 'అయ్యో పాపం!' అన్న సానుభూతి గుండెల్లో మెదిలింది. వెంటనే అందరు కలసికట్టుగా వెళ్ళి కలెక్టరుగారి కాళ్ళమీద పడండహో!' అని ఒక ఉచిత సలహా పారేశాడు.

"అవసరమొస్తే అప్పుడెప్పుడో వసుదేవుడే గాడిద కాళ్ళు పట్టే మాకిదొక లెక్కా? పక్కా!" అని మీసాల్ని మెలేశారు ఊరి పెద్దలు. గంటలమీద కలెక్టర్ బంగళా చేరుకొన్నారు. 'కరువులో తాగే నీళ్ళు తెచ్చుకుంటా ఉంటే హరిజనులు అటకాయించినారు బాబో!' అని నెత్తీ నోరు మొత్తుకుంటూ కలెక్టర్ కాళ్ల మీద పడ్డారు.

"వాళ్ళు ఆక్రమించుకొన్న పోరంబోకు భూములకు ఇంకాపట్టా కూడా మంజూరు కాలేదే? అంటే - అది ప్రభుత్వానికి చెందిన భూమి. ఆ భూమిలో బావి. ఆ బావిలో నీళ్ళు. అంతా ప్రభుత్వానిదే! ప్రభుత్వమంటే ఎవరు? ప్రజలే! ప్రజలకు ఎదురు తిరగడమంటే ప్రభుత్వాన్ని ఎదిరించినట్టే కదా?" అంటూ కలెక్టర్ కోపంతో ఊగిపోయాడు.

కాళ్ళమీద పడినవాళ్ళ కండ్లు మిలమిల మెరిశాయి.

"ఇక మీరు వెళ్ళవచ్చు. నేను రేపే మీ గ్రామానికి వస్తున్నా. వాళ్ళు నీళ్ళెలా యివ్వరో నేనూ చూస్తాను!" హుందాగా హామీ యిచ్చాడు కలెక్టరు.

కాళ్లమీద పడినా ఫలితం దక్కినందుకు పరవశించిన పెద్దలు ఆ హామీనెత్తి భుజాలమీద వేసుకొని గ్రామాన్ని చేరారు.

కలెక్టర్ ఆమరుసటి రోజే ఆ గ్రామానికి వస్తున్న సంగతి నిముషాలమీద ఇటు ఊళ్ళో అటు వాడలో కూడా పాక్కింది. గుడిసెల గుండెల్లో కలవరం పుట్టింది. అయినా అంకయ్య అదరలేదు. బెదరలేదు. కర్తవ్యాన్ని ఆలోచించుకొంటూ అందర్నీ నోళ్లు మూసుకుని జరిగేది చూస్తూ ఉండమన్నాడు.

ఆ మరసటి రోజు మండలాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ సహాయకులు, గ్రామస్థులు అందరు కలసి ఊరి ముందర చేరారు. కలెక్టరుగారి కోసరం ఎదురు చూస్తున్నారు. కలెక్టర్ వస్తే హరిజన వాడ తనిఖీ తమకు జరగబోయే మంచిని,

హరిజనులకు జరగనున్న వద్దనని చర్చించుకొంటూ కలల్లో తేలిపోతున్నారు. అంతలో కలెక్టర్ రానే వచ్చాడు. అందరు కలిసి హరిజనవాడ చేరారు.

కలెక్టర్ కారుదిగీ దిగగానే అంకయ్య అంతకు మునుపే కట్టించి పెట్టిన సందెడు లావు పూలదండను కలెక్టర్ మెడలో వేయించాడు.

తమ చేతకాని తనానికి సిగ్గుపడ్తూ జనులు ఒకరిమొగం ఒకరు చూసుకొన్నారు.

"పూలమాలలు కాదు నాక్కావలసింది. తాగే నీళ్ళు యివ్వనని చెప్పిందానికి కారణం. ఎవడబ్బ సొత్తని నీళ్ళడిగితే లేదన్నారు? చెప్పండి. కరువు కాలంలో తాగే నీళ్ళు యివ్వననడం అమానుషం. నీళ్ళెత్తు పోతానంటే ఎందుకు అటకాయించారో చెప్పండి!" సందెడులావు పూలదండను తీసేయడానికి సతమతమవుతూ కలెక్టర్ అడిగాడు.

"మేమెర్నీ అటకాయించలేదు దేవరా!" అంకయ్య వినయంగా అన్నాడు.

"అటకాయించడం కాదు. అసలు వీలే లేదన్నారటగా?"

"నాపేరు అంకడయ్యా! ఒక కడజాతివాణ్ణి. అంకడు కాకుండా శంకరుడైతే గంగను సిగలో దాచిపెట్టుకొని వీలుగాదు పొండి! అనేవాణ్ణి. కర్ణాటక ముఖ్యమంత్రి అయ్యుంటే తెలుగు దేశంతో పేచీ పెట్టకొనే వాణ్ణి. పోనీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యుంటే కర్ణాటకతో కయ్యానికి దిగేవాణ్ణి. కడజాతి వాడికంత అదృష్టమా దేవరా?"

"అమ్మో !కూత ఘనంగా ఉందే?'

"దేవరా! మా నోళ్ళు తెరిచి మేము నీళ్ళివ్వము! అని చెప్పలేదు. 'కరెంటు మోటారు పెట్టాం. పైపు లైను లాగిస్తాం!'-అంటే వద్దన్నాను. మా రెక్కల కష్టం మాకుండాదన్నాను. అంతకు మించి ఒక్క మాట మాట్లాడానేమో మీరే అడగండి!"

అంకయ్య మాట తీరుకు, వినయానికి ముగ్ధుడయ్యాడు కలెక్టర్.

ఒక్కసారి గ్రామస్థులవైపు తీక్షణంగా చూశాడు. మూగెద్దుల మాదిర వాళ్లు తలలు వంచుకొన్నారు.

"అయ్యా! మేమీ బావిని తవ్వకొక మునుపు తాగే నీళ్లకు మమ్మల్ని ఊళ్ళో అడుగు పెట్టనిచ్చారేమో అడగండి దొరా!. చేదుకుంటామంటే వొప్పుకోలేదు. పోనీ చేదిపొయ్యమంటే 'మాల నా కొడకలకు మేము చేది పొయ్యాల్నా?' అని గుడ్లురిమారు. మోట బావుల దగ్గర కడవ కంటపడ్తే నీళ్ళల్లో పేడ కలిపారు. అప్పుడు మేమంతా వచ్చి దొరగారితో చెప్పకోలేదే?""

పల్లెటూళ్ళో వ్యక్తి, అందునా హరిజనుడు. అంత చక్కగా సంస్కారయుతంగా మాట్లాడుతూంటే కలెక్టర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. అది గమనించిన మండలాధికారి 'అంకయ్య మిలిటరీ రిటర్న్డ్ సార్!" అన్నాడు.

"అలా చెప్పండి!"అని చిరునవ్వులు చిందిస్తూ కలెక్టర్ "అంకయ్యా! అపకారికి ఉపకారం చెయ్యమన్నారు పెద్దలు. ఒక చెంపమీద కొడ్తే యింకొక చెంపను చూపమన్నాడు గాంధీ మహాత్ముడు."

"నేను కాదనడం లేదు కదయ్యా?"

"అంటే- నీళ్ళివ్వడానికి మీకేం అభ్యంతరం లేదన్న మాట!"

"మాకేం అభ్యంతరమూ లేదు. అయితే ఒక్క కండీషన్!"

"ఏమిటది?"

"మేము చేది పోస్తాం. వాళ్ళను తీసుకొని పొమ్మనండి!"

"..............................."

"దేవరా! కులానికొక్క చెంబు. చెంబుకొక్క గంగ. చెంబు ఏ కులానిదైతే గంగ ఆ కులానిదై పోతున్నది. గంగకు అంటు లేదంటూనే మేము చేది పోస్తామనే కుందికి చూడండి ఆ మొగాలెట్లా మాడిపోతున్నాయో? పిచ్చిగానీ! మా రాజులు మాలగంగను తాగతారా దేవరా?"

ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు కలెక్టర్. అంకయ్యను కౌగలించుకొన్నాడు.

వాడలో ఎవరో వయసున ఉన్న ఒక చిన్నది. అంకయ్య మామతో వసంతం ఆడాలని మనసు పడిందేమో? చేద బావిలో సర సర దుత్తను వదిలింది. దుత్త నీళ్లల్లో పడేసరికి గంగతల్లి గుండెల్లో నుంచి పరవశిస్తూ అలల గలగలలు, అవి అలలు కావు! తరతరాలుగా తరగని చీడలా సమాజానికి అంటుకొన్న 'అంటు' ను కడిగేయడానికి లేచిన విమోచన ఉత్తుంగ తరంగాలు!●

*-ఆంధ్రజ్యోతి (24-10-1990)*



9.